# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు అధికం అయ్యాయని కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ రానున్న ఐదేళ్లలో దేశంలో 50 విమానాశ్రయాలను ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- ❖ ప్రజా ప్రతినిధులు అధికారులు సమిష్టిగా పని చేయాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ కోరారు.
- ❖ ఉత్తరాంధ్రలోని శంబర పోలమాంబ జాతరను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.
- ❖ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడిచింది.

========================

రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో, ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు అధికం అయ్యాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. నూతన పారిశ్రామిక పాలసీలతో దేశ విదేశాలకు చెందిన పెట్టుబడిదారులను ఆంధ్రప్రదేశ్ ఆకర్షిస్తోందని అన్నారు. అమరావతిలోని సచివాలయంలో రెండు రోజుల పాటు జరిగే కలెక్టర్ల సదస్సును ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో కొత్త ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వం తీసుకుంటున్న అనేక నిర్ణయాలను సమర్ధంగా అమలు చేసే విషయంలో కలెక్టర్లు కీలక పాత్ర పోషించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

========================

మరో 5 సంవత్సరాల్లో దేశంలో 50 విమానాశ్రయాలను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. హైదరాబాద్ శంషాబాద్‌లో ఈ రోజు జరిగిన ఎయిర్‌పోర్ట్ ప్రిడిక్టివ్ ఆపరేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భోగాపురం విమానాశ్రయం 2026 జూన్ నాటికి పూర్తవుతుందన్నారు. విమానాశ్రయాల నిర్వహణలో సరికొత్త సేవలు అందిస్తున్నామని పేర్కొంటూ....

(వాయిస్ 30 సెకన్లు)

========================

రాష్ట్ర శ్రేయస్సు కోసం ప్రజా ప్రతినిధులు అధికారులు సమిష్టిగా పని చేయాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ కోరారు. అమరావతిలోని సచివాలయంలో ఈ రోజు ప్రారంభమైన కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వాలు చేసే నిర్ణయాలను క్షేత్ర స్థాయిలో అమలు చేసే బాధ్యత కలెక్టర్ల పైన ఉందని అన్నారు. సరికొత్త ఆంధ్రప్రదేశ్ కోసం సమన్వయంతో ముందుకు వెళ్ళాలని సూచించారు. విధానాల రూపకల్పన బాధ్యత పాలకుల పైన ఉంటే, వాటిని సక్రమంగా ప్రజలకు అందించాల్సిన బాధ్యత కార్యనిర్వాహక వ్యవస్థపైన ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అనేక ప్రజా సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు కార్యనిర్వాహక వ్యవస్థ సమర్ధంగా పని చేయాలని ఉప ముఖ్యమంత్రి కోరారు.

========================

ఉత్తరాంధ్రలో ప్రఖ్యాతి గాంచిన శంబర పోలమాంబ జాతరను రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. ఈరోజు పార్వతీపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో శంబర జాతర ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లాలోని మక్కువ మండలంలో శంబర పోలమాంబ జాతర ప్రతీ సంవత్సరం ఘనంగా జరుగుతుందని తెలిపారు. ఉత్సవాలలో భాగంగా జనవరి 27వ తేదీన తోలెళ్ళ ఉత్సవం, 28న అమ్మవారి సిరిమాను ఉత్సవం, 29న అనుపోత్సవం జరుగుతాయని పేర్కొన్నారు. కాగా, జాతరకు ఇతర రాష్ట్రాల నుండి లక్షలాదిగా భక్తులు తరలివస్తారని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.

========================

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతున్నామని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సచివాలయంలో ఈ రోజు జరిగిన కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో 10 లక్షల కోట్ల రూపాయల అప్పు ఉందని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తూ.. వ్యవస్థలను చక్కదిద్దే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి వెల్లడించారు.

విరామం

========================

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జ్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. నేమ్ బ్యాడ్జ్ ద్వారా భక్తులపై దురుసుగా ప్రవర్తించే ఉద్యోగులను గుర్తించవచ్చని భావిస్తున్నట్లు చైర్మన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. భక్తుల ఫిర్యాదు ఆధారంగా ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకొనే విధంగా ఆదేశాలు ఉంటాయన్నారు. ఇదిలా ఉండగా టిటిడి చైర్మన్ ఆదేశాలతో త్వరలోనే ప్రతి ఉద్యోగికి నేమ్ బ్యాడ్జ్ ని టీటీడీ ఇవ్వనుందని అధికారులు తెలిపారు.

========================

పార్వతీపురం మన్యం జిల్లాలోని 11 సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో సుమారు 189 లక్షల రూపాయలతో మరమ్మతు పనులను చేపట్టనున్నామని కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించిందని ఈరోజు ఒక ప్రకటనలో కలెక్టర్ తెలిపారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరంకు గాను జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని మేజర్ మరమ్మతు పనులకు 150.81 లక్షలు, మైనర్ పనులకు 37.60 లక్షలు మొత్తంగా 188.41 లక్షల రూపాయల నిధులను ప్రభుత్వం కేటాయించిందని అన్నారు.

========================

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం ఏర్పడింది. ప్రస్తుతం ఇది ఆగ్నేయ-నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతోందని క్రమంగా బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అంచనా వేస్తోంది. రానున్న 24 గంటల్లో పశ్చిమ వాయవ్య దిశగా పయనించి శ్రీలంక - తమిళనాడు తీరాల దిశగా వస్తుందని పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని కోస్తా రాయలసీమ జిల్లాలో రానున్న రెండు రోజుల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆ వివరాలను వాతావరణ అధికారి తెలియచేస్తూ..

(వాయిస్ 25 సెకన్లు)

========================

శ్రీకాకుళంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలకు సెలవుల షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకూ మూడు రోజులు పాటు క్రిస్మస్ సెలవులు ఇస్తున్నామని యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత తెలిపారు. అదేవిధంగా సంక్రాంతి సెలవులు వచ్చే సంవత్సరం జనవరి 10 నుండి 18వ తేదీ వరకూ ఉంటాయని, తిరిగి కళాశాలలు జనవరి 20వ తేదీన పున:ప్రారంభమవుతాయని ఆమె ఒక ప్రకటనలో తెలియజేశారు.

========================

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు సహా ప్రజల మీద వివిధ రకాలైన భారాలు మోపుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఈ రోజు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యల మీద పోరాడాలని నాయకులను కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్డీసీ), యూసఫ్ ఎంటర్ప్రైజెస్ సంయుక్త ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ చదివిన వారికి సౌదీ అరేబియాలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ అధికారిణి పి. రోహిణీ ఒక ప్రకటనలో తెలిపారు. 18నుంచి 40 సంవత్సరాలలోపు వయసుగల అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

========================

రాజమండ్రి విమానాశ్రయం నుండి ఢిల్లీకి వెళ్ళే ఇండిగో ఎయిర్ బస్ తొలి సర్వీస్ ను రేపు ప్రారంభించనున్నామని తూర్పుగోదావరి జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్. చిన్న రాముడు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురంధేశ్వరి, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నారని ఆయన తెలిపారు.

========================

శ్రీకాళహస్తిలో ఏడు గంగమ్మ జాతర ఈరోజు తెల్లవారుజామున ప్రారంభమైంది. గంగమ్మ ఆలయం నుంచి మూలస్థానాలకు గంగమ్మలు అత్యంత వేడుకగా బయలుదేరి వెళ్లాయి. గంగమ్మ నామస్మరణ చేస్తూ పూజలను చేశారు.

==========================

==========================